సాక్షి మంచిర్యాల

బుధవారం । 22 । మార్చి । 2023

న్యూస్‌రీల్

సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- పోలీసుస్టేషన్లలో తనిఖీ



దండేపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

జన్నారం/దండేపల్లి: ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుని సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె జన్నారం, దండేపల్లి పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. స్టేషన్ల పరిసరాలు, రికార్డులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. దండేపల్లి మండలం గూడెంలోని సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అర్చకులు ఆమెను ఆశీర్వదించగా, ఈవో శ్రీనివాస్.. స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి, ప్రసాదాన్ని అందజేశారు. డీసీపీ సుధీర్ రాంనాథ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు కృష్ణారెడ్డి, సంజీవ్, ఎస్సైలు పాల్గొన్నారు.

రాజయోగమే లక్ష్యం !

ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. అధికార, ప్రతిపక్షాలు జిల్లాలో కార్యక్రమాలు ముమ్మరం చేశాయి. వీటితోపాటు స్వతంత్రులు, టికెట్ల ఆశావహులు తమ ప్రయత్నాలు వేగవంతం చేశారు. ఎన్నికల నామ సంవత్సరంగా ఉన్న శోభకృత్ నామ సంవత్సరంలో పదవుల రాజయోగం కోసం పోటీ పడుతున్నారు.

- శోభకృత్ నామ సంవత్సరంలో నేతల బిజీ బిజీ
- ప్రజాక్షేత్రంలోకి రాజకీయ నాయకులు
- జిల్లాలో మరింత ముమ్మరంగా కార్యకలాపాలు
- ప్రజల్లో బలపడేందుకు పోటాపోటీ రాజకీయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల ఏడాదిగా ఉన్న శోభకృత్ నామ సంవత్సరంలోనే జిల్లా రాజకీయ నాయకుల భవిష్యత్ తేలనుంది. వచ్చే డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికల్లో గెలిచి నిలవాలంటే సిట్టింగ్ ఎమ్మెల్యేలతో సహా ప్రతిపక్ష నాయకులకు ఈ సమయం కీలకంగా మారింది. ఇప్పటికే ఎన్నికల శంఖారావం పూరించి ప్రజల్లోకి వెళ్తున్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ నా యకులు అభివృద్ధిని నమ్ముకుంటూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మ లుచుకుంటూ లబ్ధి పొందాలని ఆరాటపడుతున్నారు.

అభివృద్ధిని నమ్ముకున్న బీఆర్ఎస్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిపైనే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆశలు పెట్టుకున్నారు. దీంతో స్థానికంగా చేపట్టిన పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎమ్మెల్యేలు బిజీగా ఉన్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రజల్లో ఉంటూ అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పుకుంటున్నారు. కింది స్థాయి, నాయకులు, ప్రజాప్రతినిధుల్లో ఉన్న అసంతృప్తులను చల్లబర్చడం, వర్గ పోరాటాలు లేకుండా చూసుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

కాంగ్రెస్‌లో 'జోడో' జోష్ !

గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఎల్పీ నేత, భట్టి విక్రమార్క చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర'తో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. ప్రస్తుతం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతుండగా, ఈ నెల 27న మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించనుంది. ఇప్పటికే స్థానిక నేతలు పాదయాత్రలో పాల్గొంటున్నారు. ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వివరిస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల గూడెం ఎత్తిపోతల పథకం పైపుల పగలడంపై దీక్షలు చేయడం తదితర కార్యక్రమాలు వివరిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు.

బీజేపీ దూకుడు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జిల్లాలోనూ దూకుడు పెంచింది. నియోజకవర్గాల్లో నాయకులు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలపై నిరసనలు, ధర్నాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై నిరసనలు, రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చే ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు.

ప్రజా సమస్యలపై వామపక్షాలు

వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎంలు సింగరేణి కార్మికుల సమస్యలు, జిల్లాలోని రైతులు, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిరసిస్తూ ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పేందుకు తమ పోరాటాన్ని చాటుతున్నారు. ఇక బీఎస్పీ, టీడీపీ, వైఎస్సార్‌టీపీ సైతం తమ పోరాటాలు, ధర్నాలు చేస్తూ ప్రజల్లో మద్దతు పొందుతున్నారు.

ఆశావహుల చూపులు

ప్రధాన పార్టీల్లోని టికెట్ల ఆశావహులు, కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకునే కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపార వేత్తలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. స్వతంత్రంగా ఉంటూనే కార్యక్రమాలు, దాన, ధర్మాలు చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షకు 329 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు 329 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్ పరీక్షకు 6,237 మంది విద్యార్థులకు గాను 5,961 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,162 మందికి గాను 1109 మంది హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

మంచిర్యాల మార్కెట్లో ఉగాది పచ్చడి సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



'శోభకృత్'కు స్వాగతం

- షడ్రుచుల పండుగ ఉగాది
- ఆలయాల్లో పంచాంగ పఠనానికి ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఏడాది పొడవునా వచ్చే పండుగల్లో చైత్రశుద్ధ పాడ్యమి నాడు వచ్చే తెలుగువారి మొట్టమొదటి పండుగ ఉగాది. తెలుగువారికి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సరం బుధవారం నుంచి ఆరంభమవుతోంది. ఉగాది రోజున పంచాంగ పఠనం ప్రత్యేకంగా నిలుస్తుంది. అర్చకులు, పండితులు రాశుల వారీగా తెలియజేసే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తారు. పంచాంగ పఠనానికి జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంటి ముంగిట మామిడాకుల తోరణాలు, ముగ్గులతో వసంతలక్ష్మిని స్వాగతిస్తారు. షడ్రుచుల సమ్మేళనం తీపి(మధురం), పులుపు(ఆమ్లం), ఉప్పు(లవణం), కారం(కటు), చేదు(తిక్త), వగరు(కషాయం) కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. మామిడి కాయలు, వేపపువ్వు, చింతపండు, కొబ్బరి, బెల్లంతో పచ్చడి తయారు చేసి ఆరగిస్తారు. ఏడాదంతా ఎదురయ్యే మంచిచెడులు, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో బుడి దామోదర్‌శర్మ సిద్ధాంతి సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

మార్కెట్‌లో సందడి

మంచిర్యాల మార్కెట్‌లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఉగాది పండుగ కావడంతో మంగళవారం పచ్చడి సామగ్రి విక్రయానికి తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. మామిడికాయలు, వేపపూత, చింతకాయలు తదితర సామగ్రి కొనుగోలు చేశారు.



దండేపల్లిలో మహామ్మాయి అమ్మవారికి పూజలు

రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులకు అనుకూలం



శోభకృత్ అనగా పాడిపంటలు, ప్రకృతి అందాలతో సస్యశ్యామలంగా ఉండేదని అర్థం. ఉదయం మంగళస్నానం చేసి ఇంటిపైన కానీ ఇంటి ముందు ధ్వజారోహణం(పతాకం) ఎగురవేస్తే విజయప్రదంగా గడుస్తుంది. వేపపూత, కొత్త చింతపండు, బెల్లం, మామిడికాయ ముక్కలతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఉదయం 9గంటల్లోపు భక్షించాలి. దీంతో అరిష్టాలు నశించి, ఆయుష్షు, ఆరోగ్యం సంపద కలుగుతుందని శాస్త్రం చెబుతుంది. సాయంత్రం వేళ ఆలయంలో పంచాంగ శ్రవణం చేయాలి. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూలంగా, వ్యాపారులు, రాజకీయ నాయకులకు ఇబ్బందికరంగా ఉంటుంది. పాలకుల్లో కొంతమందికి పదవీ గండం కలిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం నుంచి చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

– బుడి దామోదరశర్మ సిద్ధాంతి, మంచిర్యాల

క్లుప్తంగా

వరికి టుంగ్రో వైరస్

చెన్నూర్‌రూరల్: యాసంగిలో మండలంలో 13వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. మొదట్లో పీక పురుగు తెగులు సోకగా ప్రస్తుతం పొట్ట దశలో టుంగ్రో వైరస్ ఆశించింది. కాగా, కోనంపేట శివారులో ఐదెకరాల్లో వరి సాగు చేయగా మొదట పీక పురుగు, ప్రస్తుతం పొట్ట దశలో టుంగ్రో వైరస్ వ్యాపించిందని మండలంలోని వెంకంపేటకు చెందిన రైతు బాల్నె రాజేశ్ తెలిపాడు. అయితే వరిలో టుంగ్రో వైరస్ కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఏవో కవిత సూచించారు. ఈ వైరస్ ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాపిస్తుందని, దీంతోమొక్క ఎదుగుల సరిగా ఉండదన్నారు. ఆకులు నారింజ, పసుపు రంగులోకి మారుతాయని తెలిపారు. దిగుబడి పూర్తిగా తగ్గుతుందని వివరించారు. వైరస్ సోకిన మొక్కను తొలగించాలని తెలిపారు. వైరస్ నివారణకు థయోమిథాక్సమ్ 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: మండలంలోని సలుగుపెల్లి గ్రామ సమీపంలోని పల్లె ప్రకృతివనం మూలమలుపు వద్ద కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని పట్టణానికి చెందినవారు మంగళవారం కారులో మహారాష్ట్రకు వెళ్తున్నారు. ఈక్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

ఆధార్ నవీకరణ వేగవంతం చేయాలి

- పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆధార్ నవీకరణ ప్రక్రియ వేగవంతానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ నవీకరణ ప్రక్రియపై ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, సంక్షేమ శాఖల అధికారులు, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్, ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్ కార్డు పొంది పదేళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ తమ కార్డును పూర్తి వివరాలతో నవీకరించుకోవాలని సూచించారు. ఒకే దేశం రేషన్ కార్డు కార్యక్రమం కింద లబ్ధిదారులు దేశంలో ఎక్కడి నుంచైనా రేషన్ పొందవచ్చని, బ్యాంక్ ఖాతా తెరువడం తేలికవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.

టీఎస్ ఐపాస్ ద్వారా గడువులోగా అనుమతులు

జిల్లా పరిశ్రమల స్థాపన అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి టీఎస్ ఐపాస్ ద్వారా నిర్దేశిత సమయంలోగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎంఎం హరనాథ్, పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సాయిష్మా మృతదేహంతో రాస్తారోకో

- నిందితుడిని శిక్షించాలని డిమాండ్


మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న కుటుంబీకులు, బంధువులు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన ఎంబడి సాయిష్మా (22) ఆత్మహత్యకు కారకుడైన నిందితుడు నలిమెల వినయ్‌ను కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు, స్థానికులు డిమాండ్ చేశారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సాయిష్మా చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మంగళవారం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అంబులెన్స్‌లో కొత్తమామిడిపల్లికి తీసుకువెళ్లే క్రమంలో మృతురాలి కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు మేదరిపేట బస్టాండ్ వద్ద రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. తన కూతురు ఆత్మహత్యకు వినయ్‌తోపాటు మరికొందరు కారణమని అనుమానం వ్యక్తం చేశారు. లోతైన విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో మృతురాలి తల్లి రాజమణి దండేపల్లి ఎస్సై సాంబమూర్తి కాళ్లు పట్టుకుని వినయ్‌ను కఠినంగా శిక్షించాలని వేడుకుంది. ఆందోళన సమయంలో తీవ్రంగా రోధించిన మృతురాలి తల్లి, సోదరుడు స్పృహ కోల్పోయారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు సాంబమూర్తి, లక్ష్మణ్ ఆందోళన వద్దకు చేరుకున్నారు. మృతురాలి కుటుంబీకులు, బంధువులతో మాట్లాడారు. సాయిష్మా మృతిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

24న ఆందోళనకు గ్రామస్తుల తీర్మానం


సమావేశమైన తపాలపూర్ గ్రామస్తులు

జన్నారం: సింగరాయిపేట శిఖం భూమి అక్రమ పట్టా విషయంలో అధికారులు గాని, అధికార పార్టీ నాయకులు గాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తపాలపూర్ గ్రామస్తులు ఈనెల 24న ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మంగళవారం గ్రామంలో పార్టీలకు అతీతంగా నాయకులు, రైతులు సమావేశమయ్యారు. సింగరాయిపేట చెరువు అక్రమ పట్టా జరిగినట్లు అధికారులు చెబుతున్నా ఇప్పటివరకు అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం, అధికార పార్టీపై పార్టీ పరంగా చర్యలు తీసుకోకపోవడంపై ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, నాయకులు మహేశ్, కమ్మల విజయ ధర్మ మాట్లాడారు. చెరువు శిఖం భూమి అక్రమ పట్టా అని ఆర్డీవో, తహసీల్దార్ నిర్ధారించినా దానిని స్వాధీనం చేసుకుని, వారిపై చర్యలు తీసుకునే విషయంలో ఎందుకు అధికారులు అలసత్వం చేస్తున్నారని ప్రశ్నించారు. చెరువు భూమి అక్రమ పట్టా చేసుకోవడం ఎంతవరకు సమంజసమని, అధికారులు చర్యలు తీసుకోకుంటే 24న పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రమేశ్‌గౌడ్, కొమురయ్య, జగన్, రాజన్న, నగేశ్, సత్యనారాయ ఉన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

నస్పూర్: పట్టణంలో అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా ఝులిపించారు. ఈ నెల 19న 'సాక్షి'లో 'కూల్చివేసిన చోటే అక్రమ కట్టడం' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు మంగళవారం స్పందించారు. అక్రమ కట్టడాన్ని బ్లేడు ట్రాక్టర్ సాయంతో కూల్చివేయించారు. కాగా, పట్టణంలోని సీతారాంపల్లి శివారులోగల సర్వే నంబర్ 22లోని ప్రభుత్వ భూమిలో కొందరు నిబంధలనకు విరుద్ధంగా అక్రమ కట్టడాన్ని నిర్మించారని రెవెన్యూ అధికారులు కొద్దిరోజుల క్రితం దానిని జేసీబీ సాయంతో కూల్చివేయించారు. కూల్చివేసిన కొద్ది రోజులకే అక్కడే మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు అక్రమ కట్టడాన్ని కూల్చివేయించారు. అక్రమ కట్టడాలను కూల్చి ప్రభుత్వ భూములను తమ అధీనంలోకి తీసుకోవాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: ఆర్కే 6 గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి మంగళవారం గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్ తిరుపతిని కలిసి చర్చించారు. మెటీరియల్ లోడింగ్ అనంతరం కార్మికులు పనిలోకి దిగడానికి మ్యాన్‌రైడింగ్ ఏర్పాటు చేయకపోవడం, బోల్టర్ మిషన్లు రెండున్నా ఒకదానితోనే పనిచేయించడంతదితర సమస్యల కారణంగా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు. యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, నాయకులు వెంగళ కుమారస్వామి, వై కాశీరావు, చిలుముల రాయమల్లు, భూమయ్య, వెంకటరాజం, ముత్యాల రమేశ్, మాధవరెడ్డి, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



రాజం కుటుంబానికి ఆర్థికసాయం

- 'సాక్షి' కథనానికి స్పందిస్తున్న దాతలు


నగదు అందజేస్తున్న హరీశ్‌గౌడ్

నెన్నెల: 'అమ్మానాన్నలను ఆదుకోండి' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 20న ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందిస్తున్నారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన తుత్తుర్ల రాజం పక్షవాతం, ఆయన భార్య లక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వారి పిల్లలు బడి మానేసి అమ్మానాన్నలను పోషించడానికి కూలీ పనులకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. తమ తల్లిదండ్రులను ఆదుకోవాలని వారు వేడుకుంటున్న తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో మానవతామూర్తులు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం బాధిత కుటుంబానికి పలువురు దాతలు రూ.30 వేలు అందించగా మంగళవారం గొల్లపల్లికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్, నెన్నెల సర్పంచ్ తోట సుజాత రూ.10 వేలు, కరీంనగర్ పట్టణంలోని విద్యారణ్యపురికి చెందిన జాన్ విల్సన్, రత్నమ్మ దంపతులు ఫోన్ పే ద్వారా రూ.10 వేలు, నెన్నెలకు చెందిన శ్రీరాంభట్ల రంజిత్ రూ.2వేలు అందించారు. అమ్మానాన్నలకు ఆర్థికసాయం అందించినందుకు కుమారులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సాయం అందించాల్సినవారు 95735 70508 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ చేసి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

పెళ్లికి నిరాకరించిందనే అంజలి హత్య

- ఎట్టకేలకు నిందితురాలి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు


నిందితురాలి అరెస్ట్ చూపిస్తున్న సీఐ, ఎస్ఐ

రామకృష్ణాపూర్: అంజలి హత్య కేసులో నిందితురాలు మహేశ్వరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 15న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ అశోక్‌తో కలిసి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల కాలేజీరోడ్‌లో నెన్నెల మండలం మన్నెగూడకు చెందిన పెరుగు మహేశ్వరి తన చెల్లెలు పరమేశ్వరి, మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన అంజలి, మరో బంధువు కామెర విఘ్నేష్ ఒకే అద్దె ఇంట్లో ఉండేవారు. మహేశ్వరి పెట్రోల్‌బంక్‌లో, అంజలి కళ్లద్దాల షాప్‌లో పనిచేసేవారు. కాగా, అంజలి, మహేశ్వరికి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈక్రమంలో శ్రీనివాస్ అనే వ్యక్తి వీరింటికి తరచూ రాగా అంజలితో పరిచయం పెరిగింది. శ్రీనివాస్, అంజలి దగ్గరవుతున్నారని గ్రహించిన మహేశ్వరి తట్టుకోలేకపోయింది. పెళ్లి చేసుకుందామని అంజలితో మహేశ్వరిని కోరగా, ఇందుకు ఆమె నిరాకరించింది. ఇద్దరు మహిళలు వివాహం చేసుకోవడాన్ని సమాజం అంగీకరించదని చెప్పింది. దీంతో మహేశ్వరి అంజలి హత్యకు పక్కా ప్లాన్ వేసింది. అంజలి సొంతూరైన మామిడిగట్టుకు వెళ్దామని నమ్మించి ఈ నెల 15న బైక్‌పై తీసుకెళ్లింది. అటవీ ప్రాంతంలోకి వెళ్లాక అంజలిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు తానూ కత్తితో గాయపర్చుకుంది. అనంతరం మహేశ్వరి తన చెల్లెలు పరమేశ్వరి, శ్రీనివాస్‌కు ఫోన్ చేసింది. తాను అంజలి ఆత్మహత్య చేసుకోవాలని కత్తితో పొడుచుకున్నామని తెలిపింది. దీంతో శ్రీనివాస్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అంజలి అప్పటికే మృతిచెందింది. కేసు నమోదు చేసి చికిత్స అనంతరం మహేశ్వరిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.





'గెలిపిస్తే సొంతింటి పథకం అమలు'


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ సంఘాన్ని గెలిపిస్తే సొంతింటి పథకం అమలు చేయిస్తామని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడా రు. కార్మికులందరికీ సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.25లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల హక్కులను సాధించి పెట్టింది ఐఎన్టీయూసీ మాత్రమేనని, తమ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఇప్పించి నష్టాల్లో ఉన్న సింగరేణిని రక్షించామని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను సా ధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే ఉందని తెలిపారు. సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ లాంటి గొప్ప హక్కులను కార్మికులకు కల్పించింది తమ పార్టీ మాత్రమేనని చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పించామని తెలిపారు. కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణను ఏమాత్రం దరిచేరనీయలేదన్నారు. గుర్తింపు సంఘంగా టీబీజీఎస్ పూర్తిగా విఫలమైందని, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదని ఆరోపించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, నాయకులు సీహెచ్ భీంరావు, గరిగే స్వామి, సమ్ము రాజయ్య, రాంబాబు, భీం రవి, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





కిడ్నీలను కాపాడుకోవాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి, అధికారులు

శ్రీరాంపూర్: కిడ్నీలను కాపాడుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీవైసీఎంవో డాక్టర్ పీ రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం కంపెనీ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎం బీ సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును ప్రారంభించారు. కిడ్నీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చే జబ్బుల గురించి డీవైసీఎంవో వివరించారు. ప్రతి ఒక్కరూ రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగాలని, మద్యానికి దూరంగా ఉండాలని, షుగర్, బీపీ ఉన్నవారు తరచూ కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్వోటుజీఎం త్యాగరాజు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి, వీటీసీ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టె జ్యోతి పాల్గొన్నారు.











